క్లుప్తంగా

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



మాట్లాడుతున్న ఎంపీడీఓ శకుంతల

సి.బెళగల్: విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని ఎంపీడీఓ శకుంతల హెచ్చరించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. గ్రామ సచివాలయాల్లో పనిచేసే ఉద్యోగులు సమయపాలన పాటించడం లేదన్న ఫిర్యాదులు తమ దృష్టికి వస్తున్నాయని తెలిపారు. పునావృతం అయితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈఓఆర్డీ సందీప్ మాట్లాడుతూ.. గ్రామాల్లో పన్ను వసూళ్లపై పీఎస్‌లు దృష్టి సారించాలన్నారు. తాగునీటి కొరత లేకుండా చూడాలని, గ్రామాల్లో పారిశుధ్య పనులు ఎప్పటికప్పుడు పూర్తయ్యేలా చూడాలని సూచించారు.

రేపటి నుంచి తిమ్మగురుడు బ్రహ్మోత్సవాలు

- 4న సంపూర్ణ రథోత్సవం



స్వామివారి మూలవిరాట్

గూడూరు: పట్టణంలోని తిమ్మగురుడుస్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 2వ తేదీ నుంచి ప్రారంభంకానున్నట్లు ఆలయ ఈఓ గుర్రెడ్డి మంగళవారం తెలిపారు. ఈ నెల 2వ తేదీ(గురువారం) ప్రభోత్సవం, 3న ప్రారంభ రథోత్సవం, 4న సంపూర్ణ రథోత్సవం, 5న గరుడోత్సవం, 6న పార్వేట ఉత్సవం, 7న వసంతోత్సవం జరుగుతుందని వెల్లడించారు.

బొల్లవరంలో అగ్నిప్రమాదం

కల్లూరు: మండల పరిధిలోని బొల్లవరం గ్రామంలో మంగళవారం అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో గ్రామానికి చెందిన ప్రవీణ్ కొట్టం (గుడిసె) దగ్ధమైంది. సమాచారం అందుకున్న కర్నూలు అగ్నిమాపక శాఖ సిబ్బంది గ్రామానికి చేరుకోగా అప్పటికే కొట్టం పూర్తిగా కాలిపోయింది. నీళ్లు చల్లి మంటలను అదుపు చేశారు. సుమారు రూ.50 వేలకు పైగా నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపాడు.

బ్యాంక్‌లోనే పింఛన్ జమ

పాణ్యం: సామాజిక భద్రత పింఛన్లను బ్యాంకు ఖాతాలో జమ చేయనున్నట్లు ఎంపీడీఓ భ్యాగలక్ష్మీ తెలిపారు. అయితే దివ్యాంగులు, నడవలేని స్థితిలో ఉన్న వారికి ఇళ్ల వద్దే అందిస్తామని చెప్పారు. పింఛన్‌దారులు సచివాలయాల వద్దకు రావొద్దని కోరారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని ప్రతిభ



మనస్వి

గడివేముల: మండల పరిధిలోని ఆళ్లగడ్డ ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న మనస్వి మోడల్ స్కూల్లో నిర్వహించిన ఆరో తరగతి ప్రవేశ పరీక్ష ఫలితాల్లో ప్రతిభ కనబరిచింది. మంగళవారం విడుదలైన ఫలితాల్లో 100కు 82 మార్కులు సాధించింది మండలంలో ప్రథమ స్థానం సాధించింది. పాఠశాల హెచ్ఎం మహేశ్వరరెడ్డి విద్యార్థినికి అభినందనలు తెలిపారు.

ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయండి



శరీన్‌నగర్‌లో ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ సుదర్శన్‌రెడ్డి

కల్లూరు: మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కల్లూరు అర్బన్ 29వ వార్డు కార్పొరేటర్ సుదర్శన్‌రెడ్డి కోరారు. మంగళవారం సాయంత్రం కల్లూరు అర్బన్ శరీన్‌నగర్‌లో ఇంటింటికి తిరుగుతూ ఈ ఐదేళ్లలో వైఎస్సార్‌సీపీ చేసిన మంచిని వివరించారు. మరోసారి ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డిని గెలిపించుకుంటే వార్డు మరింత పురోభివృద్ధి చెందుతుందన్నారు. జగనన్న సీఎంగా ఉంటేనే సంక్షేమ పథకాలు కొనసాగుతాయన్నారు. వార్డు నాయకులు, మహిళలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న బసవేశ్వర పురాణ ప్రవచనం

హొళగుంద: స్థానిక సిద్దేశ్వరస్వామి ఆలయ ఆవరణంలో మంగళవారం రాత్రి కల్బుర్గి శ్రీ శరణ బసవేశ్వరస్వామి పురాణ ప్రవచన కార్యక్రమం భక్తులను ఆకట్టుకుంది. ప్రవచనకారుడు సిద్దరామయ్యస్వామి శరణ బసవేశ్వర స్వామి లీలల గురించి వివరించారు. సీమంతం గురించి కథలు, గేయాల రూపంలో చెప్పి ఆకట్టుకున్నారు. బొమ్మలకు సీమంతం చేశారు. మే 10 వరకు జరిగే కార్యక్రమం జరుగుతుందని ఆలయ వంశ పారంపర్య ధర్మకర్తలు రాజ పంపన్న గౌడ్ తెలిపారు.

జగన్‌తోనే పేదలందరికీ న్యాయం

- జగన్ పాలన స్వర్ణయుగం
- చంద్రబాబు పరిపాలనంతా కరువుమయం
- గంటకో మాట మార్చే బాబును నమ్మొద్దు
- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి



పెసరవాయిలో ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

గడివేముల: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా పేదలందరికీ న్యాయం చేశారని.. గ్రామాల అభివృద్ధికి కృషి చేశారని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం గడివేముల మండల పరిధిలోని దుర్వేశి, కొరటమద్ది, పెసరవాయి, కరిమద్దెల గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే కాటసాని మాట్లాడుతూ.. జగన్ పాలనలో అర్హతే ప్రామాణికంగా పార్టీలకు అతీతంగా అందరికీ సంక్షేమ పథకాలు అందాయని తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా గ్రామాలు అభివృద్ధి చెందాయన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన 99 శాతం హామీలను అమలు చేశారన్నారు. మేలు జరిగి ఉంటేనే ఓటు వేయండని అడుగుతున్న దమ్మున్న నాయకుడు జగన్ అని పేర్కొన్నారు. 2014 ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇచ్చిన హామీలను నేరవేర్చకుండా మోసం చేశారన్నారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు జన్మభూమి కమిటీల పేరుతో ప్రజలకు దోచేశారని ధ్వజమెత్తారు. దీంతో వివిధ పథకాలకు అర్హులైన ప్రజలు ఎంతో ఇబ్బందులు పడ్డారని గుర్తుచేశారు.

చంద్రబాబు పాలనంతా కరువుమయం

చంద్రబాబు సీఎంగా ఉన్న సమయంలో పంటలు పండకుండా రైతులు కరువును ఎదుర్కొన్నారని ఎద్దేవా చేశారు. టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో వర్షాలు పడక ప్రజలు, రైతులు ఎన్నో ఇబ్బందులు పడ్డారన్నారు. జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రకృతి కూడా సహకరించి వర్షాలు సమృద్ధిగా కురిశాయని తెలిపారు. పంటలకు మద్దతు ధర కల్పించడంతో రైతులు వ్యవయాన్ని పండుగగా చేసుకున్నారన్నారు. పార్టీలకు అతీతంగా ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు చెప్పారు. వలంటీర్, సచివాలయ వ్యవస్థ ద్వారా ఇంటి ముంగిటకే ప్రభుత్వ సేవలు అందించిన ఘనత సీఎంకే దక్కుతుందన్నారు. నాడు–నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్లకు ధీటుగా తీర్చిదిద్దారని తెలిపారు. ఫ్యాను గుర్తుకు ఓటు వేసి తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కేసీ కెనాల్‌కు నీరందించిన ఘనత మాదే

ఈ ఏడాది పెసరవాయి గ్రామం వద్ద ఉన్న కేసీ కెనాల్ కింద సాగు చేసిన పంటలు ఎండిపోతుండడంతో రైతులు నష్టపోకూడదని అధికారులతో మాట్లాడి నీరందించామని తెలిపారు. చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించడంతో అన్నదాతలు పంటలు పండించుకోగలిగారని చెప్పారు. జొన్న పంటకు మద్దతు ధర కల్పించామని తెలిపారు. మండలంలో 15 వేల మెట్రిక్ టన్నుల జొన్నలకు మద్దతు ధర కల్పించినట్లు పేర్కొన్నారు. పెసరవాయి గ్రామ ప్రజలకు వివిధ సంక్షేమ పథకాల ద్వారా రూ.13 కోట్లు జమ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు ఆర్‌బీ చంద్రశేఖరరెడ్డి, ఎంపీపీ నాగమద్దమ్మ, పార్టీ మండల అధ్యక్షుడు శివరామిరెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ పోగుల చంద్రశేఖరరెడ్డి, నాయకులు ఎల్లారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, డాక్టర్ నిరంజన్‌రెడ్డి, రాజారెడ్డి, ఆనంద్‌రెడ్డి, రఘుమాధవరెడ్డి, రమేష్, కృష్ణారెడ్డి, మేఘనాథరెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డి, డాలుస్వామి, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

13 తర్వాత మీ అంతు చూస్తా..!

- నీ చక్రపాణిరెడ్డిని పిల్చుకుని రా పో
- వైఎస్సార్‌సీపీ నేతలను బెదిరించిన టీడీపీ అభ్యర్థి బుడ్డా రాజశేఖర్‌రెడ్డి



సోమయాజులపల్లెలో వైఎస్సార్‌సీపీ నేతలతో వాగ్వాదానికి దిగిన బుడ్డా రాజశేఖర్‌రెడ్డి

సాక్షి, నంద్యాల: 'రేయ్...ఏం పేరురా వాడి పేరు? రేయ్ చక్రపాణి నువ్వు రారా...నీ చక్రపాణిరెడ్డిని పిల్చుకొచ్చుకోపో, సిగ్గులేని నాయాల్లారా' అంటూ శ్రీశైలం టీడీపీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ నాయకులపై బూతులు తిడుతూ ఆగ్రహం వ్యక్తం చేశారు. బండిఆత్మకూరు మండలం సోమయాజులపల్లె గ్రామంలో మంగళవారం బుడ్డా రాజశేఖర్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామంలో రోడ్లు వేసింది మేమే...అంటూ ప్రసంగిస్తూ వైఎస్సార్‌సీపీ వాళ్లు చేసిందేమి లేదంటూ స్థానిక నాయకులపై మండిపడ్డారు. దీంతో ఈ గ్రామంలో ఒకడు చక్రపాణి ఉన్నాడంటూ మొదలుపెట్టగా వైఎస్సార్‌సీపీ నేత చక్రపాణి, ఎంపీటీసీ రామయ్య, ప్రజలు బయటికి వచ్చారు. ఆ వెంటనే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి ఆగ్రహంతో ఊగిపోతూ 'రేయ్ చక్రపాణి అరవాల్సిన పనిలేదు..నేను ఇక్కడే ఉంటా, నీ ఎమ్మెల్యే చక్రపాణిరెడ్డిని పిల్చుకొచ్చుకో...బెదిరిస్తే భయపడతానా, సిగ్గులేని నాయాల్లారా అంటూ ఊగిపోయారు. పత్రికల్లో రాయలేని బూతులు తూలనాడటంతో అక్కడి వారంతా అసహ్యించుకున్నారు. చెప్తా, చెప్తా బిడ్డా నీ కథ, 13 అయిపోని చెప్తా అంటూ ఆవేశంతో తిట్ల పర్వం మొదలుపెట్టారు. చివరికి గ్రామ నాయకులు అంతా ఏకం కావడంతో పాటు పోలీసులు జోక్యం చేసుకోవడంతో వెనుదిగిరి వెళ్లిపోయారు.

జీవనశైలి మారడంతో అనారోగ్యం

కర్నూలు(హాస్పిటల్): మనిషి జీవనశైలి మారడంతోనే అనారోగ్యానికి గురవుతున్నాడని డీఎంహెచ్ఓ డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్ చెప్పా రు. మంగళవారం ఆయన మండలపరిధిలోని పసుపుల గ్రామంలోని మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో మనిషి యాంత్రిక జీవనానికి అలవాటు పడుతున్న పరిస్థితుల్లో శారీరక, మానసిక ఒత్తిడిల కారణంగా అనేక రోగాల బారిన పడుతున్నారని తెలిపారు. దీర్ఘకాలిక రోగాలు వస్తే అవి మనుషులను విడిచిపెట్టవన్నారు. అసంక్రమిత వ్యాధులతోనే అధికంగా మరణాలు సంభవిస్తున్నాయని, 30 సంవత్సరాలు దాటిన వారిలో బీపీ, షుగర్ వంటి సమస్యలు వస్తున్నాయని, మహిళల్లో క్యాన్సర్ల ముప్పు అధికంగా ఉందని, అసంక్రమిత వ్యాధులు సంక్రమించిన వా రు ఆరోగ్యంగా కనిపిస్తున్నా వారి శరీరం లోపల గుండె, ఊపిరితిత్తులు, మూత్రపిండాలు, నేత్రాలు తదితర కీలక అవయవాల పనితీరు మందగిస్తుందన్నారు. సకాలంలో గుర్తించకపోతే జీవితాంతం తీవ్ర సమస్యను ఎదుర్కోవాల్సి వస్తుందని చెప్పారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ జయలక్ష్మి, ఎంపీహెచ్ఈవో వెంకటరమణ, పంచాయతి సెక్రటరి హేమంత్‌కుమార్‌రెడ్డి, ప్రాజెక్షనిస్టు ఖలీల్, సచివాలయ ఆరోగ్య కార్యకర్తలు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కర్నూలు(అగ్రికల్చర్):విద్యుత్ లైన్‌ల మెయిన్‌టెనెన్స్ పనులు చేపడుతున్నందున నగరంలోని వివిధ ప్రాంతాలకు బుధవారం విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఆ శాఖ అధికారులు తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు సహకరించాలని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బి.క్యాంపు సెక్షన్ పరిధిలోని మహాలక్ష్మీనగర్, సోమప్ప కాలనీ, పార్థసారథి నగర్, ఎస్‌సీసీ క్యాంటీన్, హౌసింగ్ బోర్డు కాలనీ, డాక్టర్స్ కాలనీలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

లబ్ధిదారుల ఖాతాల్లోకే పింఛన్ నగదు

- పాణ్యం నియోజకవర్గంలో 28,496 మంది పింఛన్‌దారులు
- 7,011 మంది దివ్యాంగులు
- మంచానికే పరిమితమైన వారికి ఇంటి దగ్గరకే పింఛన్

కల్లూరు: ప్రభుత్వ ఆదేశాల మేరకు మే నెలలో సామాజిక భద్రత పింఛన్లను నేరుగా లబ్ధిదారుల ఖాతాలోనే జమ చేస్తున్నామని ఎంపీడీఓ జీవీ రమణమూర్తి తెలిపారు. మండలంలో మొత్తం 8421 మంది పింఛన్‌దారులు ఉండగా అందులో 2,226 మందికి ఇంటి దగ్గరనే పంపిణీ చేస్తామన్నారు. పింఛన్ సొమ్ము కోసం ఎవరూ సచివాలయాలకు రావాల్సిన అవసరం లేదన్నారు.

ఆధార్ లింక్ ఖాతాలోకి నగదు

లబ్ధిదారుల ఆధార్ అనుసంధానమైన ఎన్‌సీపీఐ ద్వారా నిర్ధారించిన బ్యాంక్ ఖాతాలకు నగదు జమ అవుతుంది. బ్యాంక్ ఖాతాలకు ఆధార్ అనుసంధానం కాని పింఛన్‌దారులతో పాటు దివ్యాంగులు, మంచానికే పరిమితమైన వారికి, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు, నడవలేని స్థితిలో ఉన్నవారికి ఇంటి వద్దనే పింఛన్ పంపిణీ చేస్తారు. పంపిణీ ప్రక్రియ సజావుగా జరిగేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. నియోజకవర్గంలోని కల్లూరు (గ్రామీణ), ఓర్వకల్లు, పాణ్యం, గడివేముల మండలల్లో మొత్తం 28, 496 మంది పింఛన్‌దారులు ఉన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 7,011 మందికి ఇంటి దగ్గరకే పింఛన్ అందించేలా, అలాగే 21,485 మందికి బ్యాంక్ ఖాతాలో నగదు జమ చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

మండలాల వారీగా పింఛన్ లబ్ధిదారుల వివరాలు

మండలం	పింఛన్‌దారులు	ఇంటి దగ్గర ఇచ్చే పింఛన్లు	బ్యాంక్ ఖాతాలో లబ్ధిదారులు
కల్లూరు (గ్రామీణ)	8,421	2,226	6,195
ఓర్వకల్లు	7,805	1,849	5,956
పాణ్యం	6,431	1,585	4,846
గడివేముల	5,839	1,351	4,488
మొత్తం	28,496	7,011	21,485

1,781 మందికి ఇంటి వద్దనే పింఛన్

సి.బెళగల్: మండలంలోని 16 గ్రామ సచివాలయాల పరిధిలో 1,781 మంది పింఛన్‌దారులకు ఇళ్ల వద్దే పింఛన్ పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకున్నామని ఎంపీడీఓ శకుంతల తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ.. మండల వ్యాప్తంగా మొత్తం 7,330 మంది పింఛన్ లబ్ధిదారులు ఉన్నారని తెలిపారు. వీరిలో దివ్యాంగులు, అనారోగ్య బాధితులు, మంచానికే పరిమితమైన వృద్ధులు 1,781 మంది ఉన్నట్లు చెప్పారు. వీరందరికీ సచివాలయ ఉద్యోగులు ఇళ్ల వద్దకే వెళ్లి పింఛన్లు పంపిణీ చేస్తారని తెలిపారు. ఇళ్ల దగ్గర పింఛన్ పంపిణీ చేసే లబ్ధిదారుల వివరాలను ఆయా గ్రామ సచివాలయాల్లో ప్రదర్శిస్తామని తెలిపారు. మిగిలిన వారికి బ్యాంకు ఖాతాలో జమ చేస్తామని చెప్పారు. పింఛన్ కోసం ఎవరూ సచివాలయాలకు వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. సచివాలయాల వారీగా ఇళ్ల దగ్గర పింఛన్ పంపిణీ చేసే లబ్ధిదారులు బ్రహ్మణదొడ్డిలో 393 మంది, బురాన్‌దొడ్డిలో 404, గొల్లలదొడ్డిలో 150, సి.బెళగల్–1లో 556, సి.బెళగల్–2లో 379, చింతమానుపల్లెలో 165, ఇనగండ్లలో 512, కంబదహాల్లో 358, కొండాపురంలో 308, కొత్తకోటలో 245, ఈర్లదిన్నెలో 334, ముడుమాలలో 308, పోలకల్–1లో 335, పోలకల్–2లో 386, పోలకల్–3లో 358, సంగాలలో 421 మంది ఉన్నట్లు వివరించారు.


ఆశ్రమాలను సందర్శించిన న్యాయమూర్తి

కర్నూలు (లీగల్): జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి మంగళవారం అబ్జర్వేషన్ హోమ్ ఫర్ బాయ్స్, వేదాస్ షెల్టర్ హోం, వన్‌స్టాప్ సెంటర్లను తనిఖీ చేశారు. ఆయా కార్యాలయాలకు సంబంధించిన రిజిస్టర్లను పరిశీలించి అక్కడ ఉన్న ప్రజలకు, మహిళలకు వివిధ చట్టాలు, న్యాయ సహాయం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. మహిళలు, పిల్లలు లీగల్ సర్వీసెస్ యాక్ట్ 1987 ద్వారా ఉచిత న్యాయ సహాయం పొందుటకు అర్హులని తెలిపారు.

5న క్రికెట్ బాలుర జట్టుకు ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): ఈనెల 5 వ తేదీ స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో ఉదయం 10 గంటలకు అండర్–19 క్రికెట్ విభాగంలో బాలుర జట్టుకు ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి కె.దేవేందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఆ పోటీల్లో పాల్గొనవచ్చని తెలిపారు. 2005 సంవత్సరం సెప్టెంబర్ 1 తేదీ తరువాత జన్మించిన వారు పోటీలకు అర్హులని తెలిపారు. ఎంపికయిన క్రీడాకారులు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న అంతర్ జిల్లా క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొంటారని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువతి మృతి



మృతి చెందిన శ్రీరాముల మానస

పాణ్యం: మండల పరిధిలోని గోనవరం గ్రామం వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువతి చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందింది. ఎస్ఐ అశోక్ వివరాల మేరకు.. అవుకు మండలం ఉప్పలపాడు గ్రామానికి చెందిన శ్రీరాములు అన్నమయ్య, భార్య సులోచన, తలనొప్పితో బాధపడుతున్న సోదరి శ్రీరాములు మానస(18)ని తీసుకుని సోమవారం నంద్యాల ఆస్పత్రికి బైక్‌పై బయలుదేరారు. గోనవరం గ్రామం వద్దకు రాగానే వాహనానికి కుక్క అడ్డు రావడంతో అదుపుతప్పి ముగ్గురూ కిందపడ్డారు. శ్రీరాములు మానస, శ్రీరాముల సులోచనకు తీవ్ర గాయాలయ్యాయి. 108 వాహనంలో సులోచనను నంద్యాల జీజీహెచ్‌కు, మానసను శాంతిరామ్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మానస మంగళవారం మృతిచెందింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. యువతి మృతితో కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది.



ఎమ్మెల్యే అభ్యర్థి సతీష్, కోట్ల హర్షవర్ధన్‌రెడ్డిపై పూలవర్షం కురిపిస్తున్న క్రిష్ణాపురం గ్రామస్తులు

ఉప్పొంగిన అభిమానం

- క్రిష్ణాపురంలో వైఎస్సార్‌సీపీ నేతలకు ఘన స్వాగతం
- 5 కి.మీ మేర పూలవర్షం.. బైక్ ర్యాలీ
- జై జగన్ నినాదాల హోరు



వైస్ ఎంపీపీ విజయ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో యువకుల బైక్ ర్యాలీ

కోడుమూరు: మండలంలోని క్రిష్ణాపురం గ్రామంలో మంగళవారం సాయంత్రం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలపు సతీష్, కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొత్తకోట ప్రకాష్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామానికి వచ్చిన నేతలకు సర్పంచ్ శ్రీనివాసరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో కోడుమూరు నుంచి క్రిష్ణాపురం గ్రామం వరకు సుమారు 5 కిలోమీటర్ల మేర పూలవర్షం కురిపించారు. బైక్ ర్యాలీ మధ్య గ్రామస్తులంతా ఏకమై అపూర్వ స్వాగతం పలికారు. జగనన్నను మరోసారి భారీ మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి సతీష్, కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుత ఎన్నికలు పేదలకు, పెత్తందారుల మధ్య జరుగుతున్నాయని తెలిపారు. ఇప్పుడు అమలవుతున్న సంక్షేమ పథకాలు కొనసాగాలన్నా, భవిష్యత్‌లో మరిన్ని పథకాలు పొందాలన్నా మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలన్నారు. అబద్ధపు హామీలతో ప్రజలను మోసం చేయాలని చూస్తున్న చంద్రబాబుకు ఈ ఎన్నికల్లో మరోసారి బుద్ధి చెప్పాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథ్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు క్రిష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ ఈశ్వర్‌రెడ్డి, ఉపసర్పంచ్ ప్రవీణ్‌కుమార్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రమేష్‌నాయుడు, నాయకులు వెంకటరెడ్డి, వెంకట్రామిరెడ్డి, నారాయణరెడ్డి, శ్రీరాములు, టైలర్ గిడ్డయ్య, రవికుమార్‌రెడ్డి, షేక్షావలి, ఆదోని శ్రీరాములు, దస్తగిరి, మస్తాన్, గిరి తదితరులు పాల్గొన్నారు.



వైఎస్సార్‌సీపీ ప్రచారానికి మద్దతుగా భారీగా తరలివచ్చిన ప్రజలు

నవరత్నాలతో ప్రతి ఇంటా సంక్షేమ వెలుగులు

గూడూరు రూరల్: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందాయని.. పథకాలు కొనసాగాలంటే మరోసారి వైఎస్సార్‌సీపీని ఆదరించాలని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలపు సతీష్, కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. గూడూరు మండల పరిధిలోని జూలకల్, పొన్నకల్ గ్రామాల్లో మంగళవారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఆయా గ్రామాల్లో వారికి ఘన స్వాగతం లభించింది. అనంతరం వారు మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయని తెలిపారు. వివిధ సంక్షేమ పథకాలతో ఆర్థికాభివృద్ధి సాధించారని చెప్పారు. ముఖ్యంగా మహిళల కోసం అనేక పథకాలు అమలు చేశారని తెలిపారు. అన్ని వర్గాలకు మేలు జరిగిందన్నారు. 58 నెలల పాలనలో మహిళల బ్యాంకు ఖాతాల్లో వివిధ పథకాల కింద రూ. 2.70 లక్షల కోట్లను రాష్ట్ర ప్రభుత్వం జమ చేసిందన్నారు. గత టీడీపీ ప్రభుత్వం మోసపూరిత హామీలు ఇచ్చి మోసం చేసిందని, మరోసారి అవే నాటకాలతో ప్రజలను మోసం చేసేందుకు ప్రయత్నం చేస్తోందన్నారు. చంద్రబాబు నాయుడు పేదల సంక్షేమ, అభివృద్ధి గురించి ఏ రోజు ఆలోచించలేదని, కేవలం అధికారం కోసం అడ్డగోలు హామీలను ఇస్తున్నారని విమర్శించారు. ప్రజలు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 99 శాతం నెరవేర్చి ప్రజలకు దగ్గరయ్యారన్నారు. వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టోను ప్రజలందరూ నమ్ముతున్నారని తెలిపారు. ఫ్యాను గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు బీవై రామయ్య, సతీష్‌ను గెలిపించాలని కోరారు. జెడ్పీటీసీ సభ్యుడు మౌలాలి, గూడూరు నగర పంచాయతీ చైర్మన్ వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్లు పీఎస్ అస్లాం, లక్ష్మన్న, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఎల్.వెంకటేశ్వర్లు, నరసింహారెడ్డి, ఎల్లారెడ్డి, శీను, జూలకల్ భాస్కర్‌రెడ్డి, దివాకర్‌రెడ్డి, రఘురెడ్డి, పట్టణ కన్వీనర్ అబేలు, సత్యాలు, దస్తగిరి విజయుడు, ఉగ్ర, బజారి తదితరులు పాల్గొన్నారు.

భక్తులతో కిటకిటలాడిన మూలపెద్దమ్మ ఆలయం



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



ఆలయ ప్రాంగణంలో భక్తుల రద్దీ

గడివేముల: కొలిచే వారికి కొంగుబంగారంగా విరాజిల్లుతున్న గడివేముల మూలపెద్దమ్మ జాతర మూడో మంగళవారం సందర్భంగా ఆలయం భక్తులతో కిటకిటలాడింది. వివిధ ప్రాంతాల నుంచి వందలాది మంది భక్తులు ఆలయానికి చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వేకువజాము నుంచే భక్తులు అమ్మవారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అమ్మవారికి కుంకుమార్చన, ఆకుపూజ వంటి విశేష పూజలు చేశారు. భక్తులకు అసౌకర్యాలు కలగకుండా ఆలయ చైర్మన్ తలారి చిన్నన్న, ఈఓ మోహన్ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

అంకిత భావంతో పనిచేస్తే గుర్తింపు

కర్నూలు కల్చరల్: అంకిత భావంతో విధులు నిర్వర్తించే ఉద్యోగులకు ఎప్పటికీ ప్రత్యేక గుర్తింపు ఉంటుందని పలువురు అధికారులు పేర్కొన్నారు. దేవదాయ శాఖ మల్టీజోన్–2 ఎస్ఈగా విధులు నిర్వహించిన సి.సి.పుల్లయ్య మంగళవారం పదవీ విరమణ పొందారు. స్థానిక రాంబొట్ల ఆలయంలో పదవీ విరమణ వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. పుల్లయ్య దేవదాయ శాఖలో వివిధ హోదాల్లో 33 సంవత్సరాలు విధులు నిర్వహిస్తూ గుర్తింపు పొందారని కొనియాడారు. అనంతరం ఆయనను దేవదాయ శాఖ అధికారులు, ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. ఇన్‌చార్జ్ ఎస్ఈ సిరిగుప్ప సతీష్, హెడ్ ఆఫీస్ ఈఈ గంగయ్య, శ్రీశైలం దేవస్థానం ఈఈ మురళీధర్‌రెడ్డి పాల్గొన్నారు.



సారా బట్టీని ధ్వంసం చేస్తున్న సెబ్ అధికారులు

సారా బట్టీ ధ్వంసం



స్వాధీనం చేసుకున్న సారా, బైక్‌తో సెబ్ అధికారులు

కోడుమూరు రూరల్: కోడుమూరు సెబ్ పరిధిలోని వెల్దుర్తి మండలం ఎల్.బండ అటవీ ప్రాంతంలో గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న నాటుసారా స్థావరంపై దాడి చేసి 450 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు సెబ్ సీఐ రామాంజనేయులు తెలిపారు. 30 లీటర్ల సారా, ద్విచక్రవాహనాన్ని సీజ్ చేసినట్లు చెప్పారు. నిర్వహకుడు బోయ అయ్యస్వామిని అరెస్ట్ చేసి డోన్ కోర్టులో హాజరుపరగా, జడ్జి రిమాండ్‌కు ఆదేశించారని వివరించారు. దాడుల్లో సెబ్ ఎస్ఐ అలీబేగ్, పీసీలు హనుమంతు, శంకర్‌నాయక్, విరుపాక్షిరెడ్డి పాల్గొన్నారు.